చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి



వెంగళరావునగర్: తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల టీచర్లు కోరారు. ఆదివారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన టీచర్లతో కలిసి విద్యార్థినీవిద్యార్థులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. యూసుఫ్‌గూడ ప్రధాన రహదారి, లక్ష్మీనరసింహనగర్, శ్రీకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లు మాట్లాడుతూ... యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ ఆర్మీ శిక్షణ కూడా విద్యార్థులకు ఇస్తున్నారన్నారు. పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారం, మధ్యాహ్న భోజనం అందుతుందని వివరించారు. పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లోనే చేర్పించాలని కోరారు. స్కూల్ టీచర్లు శ్రీదేవి, పావని, మాలతి, రాధాబాయి, తిరుపతమ్మ, వందన, ఉమర్, ఎన్‌సీసీ టీచర్ పి.ప్రభాకర్, ఎన్‌సీసీ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

జనగామకు సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

లిబర్టీ: సామ్రాజ్యవాదులను గడగడలాడించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును ఒక జిల్లాకు పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాక భువనగిరి కోటగా సుభిక్షంగా పరిపాలన సాగించిన సర్దార్ పాపన్నగౌడ్ చరిత్రలో తన పేజీని నిలుపుకొన్నారని ఆయన గుర్తుచేశారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ జిల్లాగా పేరు నామకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు త్వరలో జరిగే రాష్ట్ర కేబినేట్‌లో సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెడుతూ తీర్మానం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. జనగామ సమీపంలోని ఖిలా షాపూర్‌లో జన్మించిన సర్దార్ పాపన్నగౌడ్ భువనగిరి కోట కేంద్రంగా పరిపాలన సాగించి చరిత్రలో మిగిలిపోయారని అన్నారు.

సర్కారు బడి.. బాగుపడే దారేదీ..

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- దిక్కూమొక్కూలేని పాఠశాల
- చదువుకు దూరమవుతున్న చిన్నారులు
- దృష్టిపెట్టని ప్రజాప్రతినిధులు
- శిథిలావస్థలో ప్రాంగణం

ఫిలింనగర్: సర్కార్ బడి అంటేనే అందరికీ చిన్నచూపు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. కనీస వసతులు కల్పించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమవుతుండగా వీటి బాగు వల్ల మాకు ఒరిగేదేమీ లేదంటూ ప్రజాప్రతినిధులు చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా సర్కారు బడులు రోజురోజుకూ చదువులకు దూరమవుతూ గాలికి వదిలేసినట్లుగా మారుతున్నాయి.

◆ ఖైరతాబాద్ నియోజకవర్గం షేక్‌పేట మండలం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో ఉన్న ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రెండేళ్లుగా మురికికూపంలో కూరుకుపోయి శిథిలావస్థకు చేరి దుర్గంధానికి నిలయంగా మారింది.

◆ ఇప్పటిదాకా అటు విద్యాశాఖ అధికారులు, ఇటు జిల్లా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.

◆ బీజేఆర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు చదువుకునేవారు. ఇప్పుడు పాఠశాల మూలనపడటంతో ఇక్కడి విద్యార్థులు చాలామంది చదువులకు దూరంకాగా కొంతమంది మాత్రం పక్కన ఉన్న ఎంజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు.

◆ అందుబాటులో పాఠశాలలు లేకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరమై నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు.

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా...

బీజేపీనగర్ ప్రభుత్వ పాఠశాలను బాగుచేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, నూతన భవనం నిర్మించాలని స్థానిక యువత, బస్తీ కమిటీ, మహిళా కమిటీలు ఎన్నోమార్లు అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నాయి.

◆ బడిని బాగుచేయాలని అధికార యంత్రాంగం చుట్టూ కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగారు. బడిని బాగుచేయండి మొర్రో అంటూ విద్యార్థులు సైతం అర్థించారు. అయితే వీరి మొరను ఏ ఒక్కరూ ఆలకించలేదు. ఫలితంగా బడికి చిన్నారులు దూరం కాగా భవనం మొత్తం మురికిలో కూరుకుపోయింది.

ప్రజాప్రతినిధులకు సైతం పట్టని వైనం...

తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో బడులు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, డ్రైనేజీలు బాగుచేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రభుత్వంతో పోరాడి నిధులు మంజూరు చేయించుకోవాలి. బడులు బాగు చేయించుకోవాలి. విద్యకు మొదటి ప్రాధాన్యతనివ్వాలి.

◆ ఎన్నికలు వచ్చినప్పుడు తాము చేసిన పనులు చెప్పుకుంటూ ఓట్లు అడగాలి.

◆ అయితే బీజేఆర్‌నగర్ బస్తీలో మాత్రం కళ్లముందే బడి కనుమరుగైనా ఏ ఒక్క ప్రజాప్రతినిధికి పట్టలేదు. ఈ బడి బాగుచేస్తే తమకొచ్చే లాభం ఏమిటీ? అనే ఆలోచిస్తున్నారే తప్పితే ఇది ఎంతోమందికి జ్ఞానాన్ని అందిస్తుందనే విషయాన్ని మరిచిపోతున్నారు.

◆ ఈ ఒక్క బడి బాగుచేయించడం వల్ల అటు బస్తీని, ఇటు విద్యార్థులను బాగుచేయవచ్చనే దృష్టి ప్రజాప్రతినిధులకు ఉండటం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడే బస్తీకి రావడం, ఫలితాలు వచ్చాక ముఖం చాటేయడం రివాజుగా మారింది.

◆ కొంతమంది బస్తీ నేతలు ఎన్నోసార్లు ఈ బడి బాగు గురించి అధికారుల చుట్టూ తిరిగారు. ప్రజాప్రతినిధులను వేడుకున్నారు.

– ఎన్నికల సమయంలో డిమాండ్లు పెట్టారు. అయినా సరే ఎవరూ దీనిని పట్టించుకున్న పాపానపోలేదు.

కలెక్టర్ సారూ..!

ఇప్పటికైనా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ స్పందించి బీజేఆర్‌నగర్ సర్కార్ బడి పునఃనిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ బడి స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. యువ కలెక్టర్ పట్టించుకుంటే ఈ సమస్య నెల రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశాలూ లేకపోలేదు. ఈ బడి బాగు వల్ల ఎంతోమంది విద్యార్థులకు విద్యా దానాన్ని అందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి బడి దీనస్థితిపై దృష్టిసారిస్తే స్థానికంగా ఎంతోమంది చిన్నారులకు మేలు చేకూర్చినవారవుతారని పరిసర ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల దుస్థితిని ప్రతిబింబించే చిత్రాలివీ...







గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతం



బంజారాహిల్స్: తెలంగాణ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. సైఫాబాద్ సైన్స్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోగా ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే కేంద్రంలోకి అనుమతించారు. ఈ కేంద్రంలో మొత్తం 672 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 400 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద ఖైరతాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



లిబర్టీ: నగరంలోని పలు ప్రాంతాల్లో భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎస్.శర్మ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. లిబర్టీ అవంతీనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలలో నిరుపేద మహిళలు, వృద్ధులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ... ఆస్తి అంతస్తులు డబ్బు శాశ్వతం కాదని చేసిన సేవ చిరస్థాయిగా మిగులుతుందన్నారు.

విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్స్ పంపిణీ



ఖైరతాబాద్: పేద విద్యార్థులకు విద్యాపరంగా ప్రోత్సహించేందుకు వాసవి సేవా కేంద్రం ఆదివారం విద్యా సహాయ నిధి కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్ కిట్స్ అందజేశారు. ఆదివారం వాసవి సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 400 మంది చిన్నారులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, లంచ్ బాక్స్, వాటర్ బాటిళ్లతో కూడిన ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు. జీఎస్టీ అడిషినల్ కమిషనర్ నల్లా సాయికిషోర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ విద్యార్థులకు కిట్స్ అందజేశారు. వాసవి సేవాకేంద్రం ప్రతి సంవత్సరం విద్యా నిధి పేరుతో పేద విద్యార్థులకు చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు కొనియాడారు. వాసవి సేవాకేంద్రం అధ్యక్షుడు కొల్పూరు రమేష్, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, పూర్వ అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్, జీవితకాల ముఖ్య సలహాదారులు కొండ్లె మల్లికార్జున్, చీకట్ మర్ల అశోక్‌కుమార్, విద్యా సహాయ నిధి కమిటీ చైర్మన్ గంధె హనుమంతరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 31, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 28, రూట్ రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 34, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18.

బోరబండ పీఎస్‌లో సిబ్బంది కొరత

- అధికంగా వస్తున్న కేసులు
- ఉన్న పోలీసులపై పనిభారం
- సిబ్బందిని కేటాయించాలని సీపీకి విజ్ఞప్తి చేస్తున్న ప్రజలు



బోరబండ పోలీస్ స్టేషన్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్‌ను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఠాణా ఏర్పాటై ఏడాది గడుస్తున్నా సరిపడా సిబ్బంది మొదలుకొని వసతులు సైతం అరకొరగానే ఉన్నాయి. దీంతో సిబ్బందికి అన్నివిధాలా ఇబ్బందులు తప్పడం లేదు. సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. అయినా ఉన్న వారు అలాగే నెట్టుకొస్తున్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ సైట్–2 కమ్యూనిటీ హాల్‌లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టులో 2023 జూన్ 2వ తేదీన పోలీస్ స్టేషన్ ఏర్పాటైంది. ఈ స్టేషన్ పరిధిలో దాదాపు రోజూ కేసులు అధికంగా ఉంటాయి. వివిధ గొడవలు, కారణాలపై వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో పోలీస్ స్టేషన్ ఆవరణ కిటకిటాడుతూ ఉంటుంది. అదే స్థాయిలో వివిధ కేసులు నమోదవుతుంటాయి. ఈ నేపథ్యంలో సిబ్బంది పూర్తి స్థాయిలో లేనందున అటు ఫిర్యాదుదారులు, ఇటు పోలీసు సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం స్టేషన్‌లో 66 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. ఇంకా 29 మంది సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. సరిపడా సిబ్బంది లేనందున కేసుల పరిష్కారంలో జాప్యం, పనిభారం పెరిగిపోతోంది. ఏడాదిగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇకనైనా పోలీస్ కమిషనర్ స్పందించి బోరబండ ఠాణాకు సరిపడా పోలీసు సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డుగా సైట్-3 శ్మశానవాటిక



మాట్లాడుతున్న వేముల యాదయ్య

- పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం

రహమత్‌నగర్: బోరబండ సైట్–3 శ్మశానవాటిక డంపింగ్ యార్డుగా మారుతోందని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎస్పీఆర్‌హిల్స్ పీజేఆర్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... బోరబండ శ్మశానవాటిక అభివృద్ధి కోసం లోకాయుక్త న్యాయస్థానం చొరవ, మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సహకారంతో రూ 1.75 లక్షలు మంజూరు చేయించామని గుర్తుచేశారు. అందులో కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అప్పటి నుంచి నేటి వరకు శ్మశాన కమిటీలను ఏర్పాటు చేస్తున్న ఓర్సు అడవయ్య, కాటి కాపారి లింగయ్యల అక్రమ సంపాదన, నిర్లక్ష్యం మూలంగా శ్మశానవాటిక డంపింగ్ యార్డుగా మారిందని ఆరోపించారు. దళితులంతా కలిసి శ్మశానవాటిక కమిటీ ఏర్పాటు చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వారు కోరితే తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. దళిత నాయకుడు గ్యార నాగరాజు మాట్లాడుతూ... శ్మశానవాటిక అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. శ్మశానవాటికలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం చైర్మన్ సీతారాంరెడ్డి, వైస్ చైర్మన్ గొలు సుల ఎల్లయ్య, సంఘం నాయకులు అబ్బయ్య, సుబ్బయ్య, వేముల వెంకటేశ్, భాస్కర్, కేశవులు, మాణిక్యం, సాయి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT JUDGE, M.M. DISTRICT, AT: KUKATPALLY

O.S.No. 360 OF 2022

Between

Smt. K.Kalavathi & Others ...Plaintiffs

And

Sri S.Mallesh & Others ...Defendants

To

Smt. Yadamma

W/o. Not Known

D/o. Durgamma

Aged about 68 years, Occ: Housewife.

R/o. H.No 8-3-169/A/20/260, Indra Nagar, Borabanda, Hyderabad 18

...Defendant No.6

It is intimated that the Plaintiffs have filed the above Suit O.S. No. 360 of 2022 on the file of Hon'ble III Addl Dist Judge, MM Dist, at Kukatpally against the Defendants herein for Partition and Separate Possession.


Please take Notice that the above case O.S. No. 360 of 2022 is posted for your appearance and reply if any, please make it convenient to appear before the Court of Hon'ble III Addl Dist Judge, MM Dist, at Kukatpally either personally or through Advocate at 10:30 A.M on 20-06-2024 or else the matter will be decided in your absence in accordance with law.

(BY ORDER OF THE HON'BLE COURT)

Sd/- U. Venkateswara Rao Advocate, Plot No. 813, Venkanarda Nagar Colony, Kukatpally, Hyderabad - 72

Cell: 98480 24373, Ph: 040-35902375

ముసుగులు తొలగేనా?



బంజారాహిల్స్: ఎన్నికల కోడ్‌లో భాగంగా ప్రముఖుల విగ్రహాలకు ముసుగులు వేశారు. శుక్రవారం రాత్రి నుంచి ఎన్నికల కోడ్‌ను ఎత్తివేశారు. అయినా జాతి నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను మాత్రం ఇంకా తొలగించలేదు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద, సోమాజిగూడ, లక్డీకాపూల్, పంజగుట్ట, అమీర్‌పేట ప్రాంతాల్లో సుమారు 15 చోట్ల పలువురు నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఈ క్రమంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తా వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహానికి ముసుగు తీయకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత యంత్రాంగం స్పందించి నాయకుల విగ్రహాలకు ఉన్న ముసుగుతు తొలగించాలని కోరుతున్నారు.

కిషన్‌రెడ్డి మరోసారి కేంద్ర మంత్రి కావడం గర్వకారణం

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ లోకసభ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రి పదవి వరించడం గర్వకారణమని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ప్రజల కోసం కిషన్‌రెడ్డి పని చేసినందుకే మరొకసారి సికింద్రాబాద్ ఎంపీగా గెలిచారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ ఎదుగుదలకు కిషన్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. గడచిన ఐదేళ్లలో కిషన్‌రెడ్డి నేతృత్వంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. అలాగే ఎంపీ బండి సంజయ్ కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎదిగారని ఆయన గుర్తుచేశారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల సహకారంతో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమని కేశబోయిన శ్రీధర్ స్పష్టం చేశారు.

బక్రీద్ నేపథ్యంలో పోలీస్ చెక్‌పోస్టులు



బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు

బంజారాహిల్స్: బక్రీద్ పండగ సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు పికెట్‌లను ఏర్పాటు చేశారు. ఆవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు పికెట్‌లు 10 రోజుల నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఆటో ట్రాలీలు, డీసీఎంలు, లారీలను చెక్ పోస్టులో నిఘాలో ఉండే పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆవుల అక్రమ రవాణాపై దృష్టి సారించిన పోలీసులు ముందస్తు సమాచారంపై కూడా కన్నేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సిబ్బందిని విధుల్లో నియమించారు. ఈ పోలీసులు 24 గంటల పాటు నిఘాలో ఉండనున్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తారు.

సమస్యల పరిష్కారంపై బస్తీ నేతలు దృష్టి సారించాలి



పర్యటిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బస్తీ నాయకులు స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి సూచించారు. హనుమాన్ టెంపుల్ గల్లీ, చర్చి గల్లీ, బంగారు మైసమ్మ ఆలయ ప్రాంతాల్లో ఆయన ఆదివారం సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలు బస్తీల్లో సీవరేజీ, సీసీ రోడ్డు పనుల నిమిత్తం ఇప్పటికే నివేదికలు రూపొందించామన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పనులు ప్రారంభించలేదని తెలిపారు. కోడు తొలగినందున త్వరలో ఆయా అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బస్తీ నాయకులు స్థానికులతో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని తన దృష్టికి తీసుకొస్తే ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ స్పష్టం చేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సోమాజిగూడ ప్రభుత్వ పాఠశాల 1982 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

బంజారాహిల్స్: 42 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులు కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1982 బ్యాచ్‌కు చెందిన సోమాజిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం పర్యాటక భవన్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఆత్మీయ సమ్మేళనం కలుసుకున్న వారంతా ఫొటోలు దిగుతూ, జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామ్‌దాస్, షేక్ నజీర్‌బాష, దయానంద్, కృష్ణ, సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, స్వప్న, ముత్యం తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు



శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ ఎంపీగా వరుస విజయాలను సాధిస్తున్న అసదుద్దీన్ ఒవైసీకి ఎంఐఎం పార్టీ శ్రీనగర్‌కాలనీ ప్రెసిడెంట్ ఎల్లారెడ్డిగూడకు చెందిన షేక్ జాఫర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం దారుసలాంలో ఆయనను కలిసి పూల బొకే అందజేశారు. నేతలు సయ్యద్ యూసుఫ్, జహంగీర్, నగేష్, ఉస్మాన్, నిజామ్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి ఐ కేర్ సేవలు ప్రారంభం

ఖైరతాబాద్: అన్ని వర్గాల ప్రజలకు వైద్యసేవలను సరళీకృతం చేయడంతో పాటు నూతనంగా కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది వాసవి హాస్పిటల్. ఆదివారం లక్డీకాపూల్‌లోని వాసవి హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి ఐ కేర్ సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో వర్టెక్స్ హోం ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గురు మురళీ మోహన్, విశ్వనాథ్ ప్రాజెక్ట్స్ ఎండీ శివకుమార్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవి హాస్పిటల్ చైర్మన్ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, కోశాధికారి రఘునాథన్, కన్వీనర్ జయప్రకాశ్ రాం తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతిని విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

లిబర్టీ: దళితుల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను ఆయా రంగాలకు ఖర్చు చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. సబ్‌ప్లాన్ కింద నిధులు కేటాయించడం తప్ప నిధులు విడుదల చేయలేదని చేసిన నిధులు కూడా సక్రమంగా ఖర్చు చేయలేదని అన్నారు. ఆదివారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2014 నుంచి 2024 వరకు ఒక లక్ష 41 వేల కోట్ల రూపాయలు ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ కింద కేటాయించారని.. ఖర్చు చేసింది మాత్రం రూ. 78 వేల కోట్లు మాత్రమే అని ఆయన తెలిపారు. 63 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయలేదని అసలు కేటాయింపులు జరగలేదని ఆయన ఆరోపించారు. పదేళ్ల కాలంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఎస్సీ అభివృద్ధి శాఖకు నిధులు కేటాయించడం తప్ప విడుదల చేయకపోవడం మరో వంక ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాల కోసం దారి మళ్లించడం తప్ప ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి జీవనస్థితిగతుల మార్పు కోసం మెరుగైన జీవన ప్రమాణాల కోసం గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం డబ్బులు ఖర్చు చేయలేదని అన్నారు. ఎస్సీలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు ఎలా దారి మళ్లిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా అన్యాయం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ ఖైరతాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు అజయ్ మృతి



అజయ్ (ఫైల్)

ఖైరతాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గజ్జల అజయ్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. కోవిడ్ తరువాత ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న అజయ్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్ తెలిపారు.

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9912220379
9640081203